TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 281 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.07.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ అభివృద్ధి

మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందని పేర్కొన్నారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ సహకారంతో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకురావడం సవాలుతో కూడుకున్నదని, ఇక్కడి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిని సాధించడానికి యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి అకడమిక్ పరిజ్ఞానం ఉన్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన కొన్ని నైపుణ్యాలలో లోపాలు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. మంథనిలోని టాస్క్ కేంద్రం కూడా ఇదే విధంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించి వారికి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుందని వివరించారు. టాస్క్‌లో నమోదు చేసుకుని పలు శిక్షణ కోర్సులు పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

ఇక్కడ మంచి కంపెనీలు శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ మంథనిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చిందని, ప్రతి విద్యార్థి భవిష్యత్తు తన బాధ్యతగా భావిస్తున్నానని, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు.



అలాగే మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందగలరని అన్నారు. గంగాపురిలో రూ.7.3 కోట్ల వ్యయంతో ప్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్‌కు ఈరోజు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత ఒకేసారి 400 మంది మహిళలకు శిక్షణ అందించవచ్చని, ఇది విజయవంతమైతే మరో యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడుగడ్డం వంశీకృష్ణ మాట్లాడారు ప్రతి నిరుద్యోగ యువకుడు కష్టపడే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని, కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. మంథని పట్టణానికి అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన శిక్షణ కేంద్రాలను తీసుకురావడమే లక్ష్యంగా టాస్క్ అడ్వాన్స్‌డ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అనేక ఉద్యోగాలు మార్పులకు లోనవుతున్నాయని, మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే యువత తప్పనిసరిగా ఏఐ వంటి ఆధునిక నైపుణ్యాలను అభ్యసిస్తూ కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, టాస్క్ చైర్మన్ నితిన్ కుమార్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రివేది,ఏఎంసీ చైర్మన్ కె.వెంకన్న,ప్రజాప్రతినిధులు, అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం మొత్తం కొనే వరకు వెంటబడుతాం



నర్సంపేట/గీసుకొండ :అమృత్ తెలంగాణ: ధాన్యం ఆఖరి గింజ కొనే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను, పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ మండలం ఊకల్ సొసైటీలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. నెల రోజులుగా మక్కలను తీసుకొచ్చి మార్కెట్లో పడిగాపు కాస్తున్నామని రైతులు కేటీఆర్‌కు చెప్పారు. మార్కెట్లో పంట కొనుగోలు తీరుపై కేటీఆర్ ఆరా తీశారు. అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో విఫలమైందన్నారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం 27వేల కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను ఎప్పటికప్పుడూ కాంటా వేసి రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కూడా రికార్డ్ స్థాయిలో నాడు సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేశామన్నారు. నేడు రైతులు కష్టపడి పండించిన మక్కలు ఎక్కడికక్కడా కల్లాల్లోనే ఉన్నాయని తెలిపారు. దీనికి దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోవడమే కారణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రియల్ఎస్టేట్ మీద ఉన్న ధ్యాస పాలనపై లేకుండా పోయిందని విమర్శించారు. అకాల వర్షాల నేపథ్యంలో మొక్కజొన్న, ధాన్యం పండించిన రైతులు తీవ్ర భయాందోళనలతో ఉన్నారని అన్నారు. అలాగే, దళారులతో కుమ్మక్కై కొనుగోళ్లు ఆలస్యం చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ధాన్యం, శనగలు, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లు ప్రారంభించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన రూ.లక్ష కోట్లకుపైగా కుంభకోణంపై ఆధారాలతో సహా సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలకు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిందని అన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించకుండా ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్ చింతం సదానందం, మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ ఎంపీపీ ముంత కళావతి రాజయ్యయాదవ్ ఉన్నారు.

## టీవీకేకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకే అధినేత విజయ్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌తో జరిపిన చర్చలు సఫలమైయ్యాయి. దీంతో విజయ్‌కు సంపూర్ణ మద్దతు తెలుతున్నట్లు కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. సోమవారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే 107 స్థానాలు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో ఉన్నంది.పలు పార్టీలమద్దతు కోసం టీవీకే ప్రయత్నాలు చేస్తోంది. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌లో కాంగ్రెస్ భాగస్వామ్య పార్టీలుగా ఉన్నాయి. మరోవైపు వామపక్షాలతో కూడా పొత్తు పెట్టుకోవడానికి విజయ్ సన్నాహాలు చేస్తున్నారు. సిపిఐ(ఎం)లను టివికె అధ్యక్షుడు విజయ్ సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు సీట్లను గెలుచుకోగా, సిపిఐ(ఎం) రెండు సీట్లను గెలుచుకుంది. కాగా, రెండు నియోజకవర్గాలైన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ లలో టివికె అధ్యక్షుడు విజయ్ విజయం సాధించినప్పటికీ.. ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వున్నందున టివికె కు 107మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉంటారు. దీంతో




సభలో బలం 233కి పడిపోతుంది. మరోవైపు 117 సీట్ల మెజారిటీ సాధించేందుకు టివికెకు మరో పది మంది సభ్యుల మద్దతు అవసరం ఉంది.

## తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కార్పొరేషన్లకు చైర్మన్లను, 11 వైస్ చైర్మన్లను ఖరారు చేశారు. విద్యా మరియు భాషా విభాగానికి సంబంధించి తెలుగు అకాడెమీ చైర్మన్‌గా ప్రొ. వెంకటనారాయణ నియమితులయ్యారు.

కమ్మ కార్పొరేషన్: బండి రమేష్ (చైర్మన్), పరుచూరి మురళి (వైస్ చైర్మన్)

వెలమ కార్పోరేషన్ చైర్మన్: జువ్వాడి నర్సింగ్ రావు

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ : బన్వరాజు శ్రీనివాస్, పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లు

యాదవ సహకార సంస్థ: ఎం. రఘునాథ్ యాదవ్ (చైర్మన్), గజ్జి భాస్కర్ యాదవ్ (వైస్ చైర్మన్)..

గౌడ సహకార సంస్థ: మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్ (చైర్మన్), కేసం నాగరాజు గౌడ్ (వైస్ చైర్మన్)

మున్నూరుకాపు సహకార సంస్థ: బొమ్మ శ్రీరామ్(చైర్మన్), అల్లం భాస్కర్లు(వైస్ చైర్మన్)

చేనేత అభివృద్ధి సంస్థ (టూజూ): దూడెం వెంకట్ రమణ, జక్కని అనిత

పద్మశాలీ కార్పోరేషన్: చైర్మన్ గూడూరు శ్రీనివాస్

వడ్డెర సహకార సంస్థ: గుంజా రేణుక నారాయణ, బత్తుల వెంకటేష్,

రజక సహకార సంస్థ: డాక్టర్ దాసరిరాజు అజయ్ కుమార్, బంగారు బాబు,

మేర సహకార సంస్థ: సంగ వెంకటరాజం, ఎం. లక్ష్మీ నారాయణ

వాల్మీకి బోయ సంస్థ: గట్టు తిమ్మప్ప, బోయ నాగేష్‌లు

పెరిక సహకార సంస్థ: దొంగరి వెంకటేశ్వర్లు, బుడగం శ్రీనివాస్‌లు

పశుసంవర్ధక ఫెడరేషన్: చైర్‌పర్సన్‌గా కొల్లె సరిత,


## 15న దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం ఈ నెల 15న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మతోన్మాదులు, కార్పొరేట్ శక్తుల నుంచి పెరుగుతున్న జంట ప్రమాదం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మతం, కులం పేరుతో జరుగుతున్న రాజకీయాలు దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. వివిధ రాష్ట్రాల్లో గెలవడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మికులను సమీకరించి మిలిటెంట్ పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ప్రజలకు అండగా ఉంటూ రాజ్యాంగం, చట్టాలన్నింటినీ అమలు చేస్తూ దేశంలోని మంచి పాలన అందించిన కేరళంలోని వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం, రాష్ట్ర హక్కులను హరించడం, నిరుద్యోగం పెంచేలా కుట్రలు చేసిందని విమర్శించారు. కార్పొరేట్లకు కొమ్ముకాసే కాంగ్రెస్ పార్టీ కేరళం ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు. కేరళంలో వామపక్ష ప్రభుత్వం ఓడిపోవడం ప్రజలకు నష్టదాయకమన్నారు. బీజేపీయేతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను అస్థిరపర్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, తదితర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. ఎప్పటిలాగే ఎన్నికలు అయిపోగానే మోడీ సర్కారు గ్యాస్ రేట్లను పెంచిన విషయాన్ని ఎత్తిచూపారు. పెంచిన గ్యాస్, నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్‌చేశారు. వీబీ–జిఆర్ఏఎమ్‌జీ పథకం ద్వారా కొత్తకొత్త జీవోలను తీసుకొచ్చి కూలీలను ఉపాధికి దూరం చేసే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఈ నెల 15న దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఆఫీస్ బేరర్లు బి.పద్మ, పొన్నం వెంకటేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, కొండమడుగు నర్సింహ, ములకలపల్లి రాములు, కందుకూరి జగన్, ఎం.ఆంజనేయులు, పెద్ది వెంకట్రాములు, ఎ.వీరయ్య, బి.సాంబశివ, లంక రాఘవులు, ఎం. నర్సింహులు, బి.సమ్మయ్య, సీహెచ్.రమేశ్, ఆర్.శశిధర్, శారద, తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ!

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సీనియర్ నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎన్ లో చేరడంతో తెలంగాణలో జగిత్యాల రాజకీయాలు గత కొద్దిరోజులుగా ఆసక్తికరంగా మారిన సంగతి తెలిసిందే. అయితే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడంతో ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలు పక్క చూపులు చూస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ ఎల్. రమణ పార్టీని వీడతారని ప్రచారం జరుగుతోంది. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడంతో వచ్చే ఎన్నికల్లో ఆయన కచ్చితంగా జగిత్యాల నుండి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రమణను కేసీఆర్ గతంలో మంత్రి పదవి ఆఫర్ చేసి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ ఇచ్చారు కానీ మంత్రిపదవి మాత్రం




రమణకు దక్కలేదు. దీంతో ఆయన కేసీఆర్ తీరుపై కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడంతో జగిత్యాలలో తన ప్రాధాన్యత తగ్గిందని కూడా రమణ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన కవితను కలిశారని టీఆర్ఎస్ లో చేరేందుకు సిద్ధం అవుతున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. సోషల్ మీడియాలో కవిత ఇంటి ముందు ఓ కారు నిలిచి ఉండగా అది ఎమ్మెల్సీ రమణదేనని, ఆ కారులో వచ్చి కవితను కలిసినట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇది కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం మాత్రమే, ఇందులో ఎంతవరకు నిజం ఉందో తేలాలంటే కవిత గానీ రమణ గానీ స్పందించాల్సి ఉంది.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా







సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన భారీ జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తోందని తెలిపారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, ప్రైవేటు రంగంలో ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలు ఎంతో కీలకమని, చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన మెళకువలను పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని యువతకు దిశానిర్దేశం చేశారు. నియామక పత్రాలు అందుకున్న వారు క్రమశిక్షణతో ఉన్నతంగా స్థిరపడాలన్నారు. అంతకుముందు వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఎంపిక ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి మిల్కా యువత, నిరుద్యోగులు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్లో ఘనంగా రైతు వారోత్సవాలు

## రైతులు మార్కెటింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలి: బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం" మరియు రైతు వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య,మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, హాజరయ్యారు.ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలంటే మార్కెటింగ్ విధానాలపై సమగ్ర అవగాహన అవసరమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మార్కెట్ సదుపాయాలు, ధరల సమాచారం, నిల్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు మార్కెట్ వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కూడా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు,వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ యార్డు సిబ్బంది, రైతులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# కజ్జర్లలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ళను రిబ్బన్తో కట్ చేసి ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పక్కన గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల గృహ లబ్ధిదారులను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పక్కన గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి దృశ్యం

అమృత్ తెలంగాణ తలమడుగు న్యూస్ ఆదిలాబాద్ : తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై, గృహప్రవేశం చేసిన కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ఇందిరమ్మ పథకం ద్వారా గృహ కలలను సాకారం చేస్తోంది అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సొంత ఇల్లు కలిగి గౌరవప్రదమైన జీవితం గడపడం చాలా ముఖ్యమని అన్నారు. లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి జీవనం సాగించాలని సూచించారు.అలాగే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ గంగన్న, ముడ్డెల్లా పోషెట్టి, గ్రామ పెద్ద దేవ రెడ్డి, తిరుపతి, శ్రీను, పూర్ణ చందర్, శ్రీకాంత్, నారాయణ, చిన్న భూమన్న, చార్లా రవి, కేశవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సాంకేతికతతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన రైతులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం తాంసి మండలం పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్తంగా కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన "డ్రోన్ సాంకేతికత ద్వారా నువ్వుల విత్తే విధానం" ప్రదర్శనను ఆయన పరిశీలించి వివరాలను వివరాలపై ఆరా తీశారు . ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా విత్తనాలు చల్లే ప్రక్రియను ఆయన స్వయంగా పరిశించి, డ్రోన్ ఏ విధంగా పని చేస్తుంది, విత్తనాలను ఎంత వేగంగా, ఎంత సమానంగా చల్లుతుంది అనే అంశాలపై శాస్త్రవేత్తలు కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సాంప్రదాయ పద్ధతుల్లో విత్తనాలు విత్తడం వల్ల సమయం, శ్రమతో పాటు విత్తనాల వృథా ఎక్కువగా ఉంటుందని, డ్రోన్ల వాడకం ద్వారా వీటిని సమర్థవంతంగా అధిగమించవచ్చని అన్నారు. డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లడం, మందుల పిచికారీ చేయడం వల్ల కూలీల కొరత సమస్య తీరడమే కాకుండా, సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వినూత్న ఆవిష్కరణలను రైతులకు చేరువ చేసేందుకు జిల్లా యంత్రాంగం, కృషి విజ్ఞాన కేంద్రం నిరంతరం కృషి చేస్తున్నాయని, రైతులు ఈ తరహా ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఖర్చు తక్కువతో కూడిన పరిష్కారాలను రైతులకు చూపేందుకు ఈ క్షేత్రస్థాయి ప్రదర్శన ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ, హాకా మేనేజర్ వెంకటేశ్వర్లు, జేడీఏ శ్రీధర్ స్వామి, గ్రామ సర్పంచ్ భూమన్న, రైతు కేమ లక్ష్మణ్, ఏవో రవీందర్, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# వైకల్యాన్ని జయించి పదో తరగతిలో సత్తా చాటిన సాయి చరణ్: జిల్లా కలెక్టర్ రాజర్షి షా అభినందనలు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ శారీరక వైకల్యం ఆశయానికి అడ్డంకి కాదని పట్టుదలతో నిరూపించిన విద్యార్థి మార్కొండు సాయి చరణ్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను సాయి చరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో జరిగిన ఒక విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులను కోల్పోయినప్పటికీ, అధైర్యపడకుండా చదువును కొనసాగించి పదో తరగతి ఫలితాల్లో 417 మార్కులు సాధించిన సాయి చరణ్ ప్రతిభను ఈ సందర్భంగా కలెక్టర్ కొనియాడారు. ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన పొచ్చన్న కుమారుడైన సాయి చరణ్, స్థానిక సీ.బీ.ఆర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. విధి వంచించినా, ప్రకృతి వైపరీత్యం తన చేతులను దూరం చేసినా.. ఆత్మవిశ్వాసాన్నే పెట్టుబడిగా మలచుకున్నాడు. ఎవరి సహాయం లేకుండా, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు గురువుల సహకారంతో పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాయి చరణ్ సాధించిన విజయం సామాన్యమైనది కాదని, జిల్లాలోని విద్యార్థులందరికీ అతను ఒక గొప్ప స్ఫూర్తిప్రదాత అని అన్నారు. వైకల్యం అనేది శరీరానికే పరిమితమని, మనసులో దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని చరణ్ నిరూపించాడన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, జిల్లా యంత్రాంగం తరపున అతడికి పూర్తి మద్దతు ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ఆదిలాబాద్‌లో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణంలోని పీఎస్ గార్డెన్‌లో చింతల వారి పెళ్లి వేడుకలో పాల్గొని నూతన వధూవరులు దశరథ్--పల్లవిలను ఆశీర్వదించారు.అలాగే జీఎస్ గార్డెన్‌లో గౌడి వారి వివాహ వేడుకలకు హాజరై నిఖిల--వెంకటేష్ దంపతులను ఆశీర్వదించారు.

ఇక చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన కోలవారి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు సాయి కృష్ణ--వైశాలిలకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఆర్వో స్రవంతి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా (DRO) బాధ్యతలు స్వీకరించిన స్రవంతి గారు బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారిని వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, జిల్లా పాలనలో, రెవెన్యూ అంశాలలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో



నిర్మల్ జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటిడిఏ పిఓ

నిర్మల్ జిల్లా మే 6 అమృత్ తెలంగాణ ఐటీడీఏ పీవో మంద మకరందు బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు సమావేశమై జిల్లాలో ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై చర్చించారు.

## ఘనంగా శ్రీ బీరప్ప స్వామి - కామరాతి దేవి కళ్యాణోత్సవంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి





మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: దుర్గ నగర్ వార్డ్‌లోని శంకర్ గుట్టలో శ్రీ బీరప్ప స్వామి - కామరాతి దేవి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, సంప్రదాయాలు మన సంస్కృతికి మూలస్తంభాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ది వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, మావల ఉప సర్పంచ్ అడెల్లు, గుంటి ఇలయ్య, కెందా మల్లేష్, ఎరుమల్ల రవి, కెందా రాకేష్, బైరి మల్లేష్, మందా శ్రీనివాస్, కెందా పోశెట్టి, పెద్ది కొమురవెల్లి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సత్ఫలితాలు ఇస్తున్న భైంసా ప్రజావాణి

### ఫిర్యాదు దారులతో కిక్కిరిసిన భైంసా ఎస్పీ క్యాంపు ఆఫీస్

**జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ను కలిసి సమస్యలను విన్నవించుకునేందుకు భారీగా పోటెత్తిన ఫిర్యాదు దారులు**




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఈరోజు భైంసా క్యాంపు ఆఫీస్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఫిర్యాదు దారులు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ను కలిసి సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయానికి పోటెత్తారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి తెలియజేయాలనే ఉద్దేశంతో భైంసా సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుండి 16 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించేందుకు భైంసా క్యాంపు రావడం జరిగింది. దీంతో క్యాంపు ఆఫీస్ మొత్తం ఫిర్యాదు దారులతో నిండి పోయింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్, ప్రతి ఒక్క ఫిర్యాదుదారుడి సమస్యను ఎంతో ఓర్పుతో, శ్రద్ధగా విని,సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే విచారణ జరిపి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం లేకుండా పనిచేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను నేరుగా వినిపించుకునే అవకాశం కల్పించినందుకు ఫిర్యాదుదారులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీ కు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వం కలిసిన జిల్లా కలెక్టర్

నిర్మల్ జిల్లా మే 6 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి ను, కోర్టు కార్యాలయంలో పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఇరువురు సమావేశమయ్యి పలు అంశాలపై చర్చించారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 6, 2026: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రవాణా గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గోదాములను తక్షణమే ప్రారంభించి, ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర గోదాముల సామర్థ్యం మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు ఇప్పటికే విడుదల చేసినందున మిల్లర్లు ఆలస్యం చేయకుండా బిల్లుల ప్రకారం వరి ధాన్యం తీసుకుని మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిల్లుల బ్యాంక్ గ్యారంటీలను సమీక్షించి, అర్హత ఉన్న మిల్లులకు వరి ధాన్యం విడుదల చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో సన్నాల సాగు 90 శాతానికి పైగా ఉన్నందున, కొనుగోలు పరిమాణాన్ని గత సంవత్సరాల కంటే మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న గోనె సంచులను మిల్లర్లు పరస్పర అవగాహనతో అవసరమైన చోట వినియోగించుకోవాలని, గోనె సంచుల కొరత ఎక్కడా లేకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలాహొహొసంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేహొహొధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ సంవత్సరంలో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి అంచనా సుమారు 1 లక్ష 50 వేల మెట్రిక్ టన్నుల నుండి 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాలలో వరి శుభ్రపరిచే యంత్రాలను ఏర్పాటు చేసి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో హమాలి చార్జీలకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణాహొహొగుత్తేదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు పూర్తైన తరువాత మాత్రమే రవాణా చార్జీలు చెల్లించబడతాయని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి సేవలు అందేలా సహకార శాఖ, సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యపు సంచులు నిల్వ చేయడానికి అదనపు స్థలాలు సమకూర్చుకోవాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్

నిర్మల్ జిల్లా మే 6 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో ధాన్యపు సంచులు నిల్వ చేయడానికి ముందు జాగ్రత్తగా అదనపు స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సారంగాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదామును వెంటనే సిద్ధం చేయాలన్నారు. అవసరమైతే అదనంగా ధాన్యపు సంచులు నిలువ చేయడానికి స్థలాలను అన్వేషించాలని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యాన్ని అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సిసి కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రికార్డులపై సమగ్ర శిక్షణ

**భూమి చట్టాలు, రికార్డులపై పోలీస్ శాఖకు అవగాహన కల్పించిన రెవెన్యూ అధికారి నలందప్రియ**

**భూమాఫియా మోసాలపై తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం**

**కొనుగోలుదారులు తప్పనిసరిగా సరిచూసుకోవాల్సిన పత్రాలపై వివరాలు**

**విలేజ్ మ్యాప్, టిప్పన్, సేత్వార్ వంటి ప్రాథమిక రికార్డుల వివరణ**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో భూమి కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన చట్టాలు, రెవెన్యూ రికార్డులు మరియు భూమాఫియా నేరాల నివారణపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ తరపున భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ పాల్గొని పోలీసు అధికారులకు సమగ్ర శిక్షణ అందించారు. భూమి యాజమాన్య చరిత్ర, గతంలో అమల్లోకి వచ్చిన భూ చట్టాలు, వాటి పరిమితులపై వివరించారు. అదేవిధంగా పాస్‌బుక్, టైటిల్ డీడ్, పట్టాదార్ పాస్‌బుక్, పహాని (అడంగల్), ఎంకంబరెన్స్ సర్టిఫికేట్ (EC) వంటి ముఖ్య రికార్డుల ప్రాముఖ్యతను తెలియజేశారు. విలేజ్ మ్యాప్, టిప్పన్, సేత్వార్ వంటి ప్రాథమిక రికార్డులను పరిశీలించడం అవసరమని సూచించారు. భూమాఫియా నేరస్తులు చేసే మోసాలు, ముఖ్యంగా నకిలీ పత్రాలు, GPA దుర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించి, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ట్రైబల్ మరియు ఏజెన్సీ భూములు, ల్యాండ్ సీలింగ్ యాక్ట్, ఇనాం రద్దు చట్టాలు, భూధాన్ భూములు, అసైన్ చేసిన భూములపై కూడా పూర్తి అవగాహన కల్పించారు. అలాగే ROR, ధరణి వంటి భూ రికార్డు వ్యవస్థలపై వివరించారు. ఈ సందర్భంగా భూమి సంబంధిత కేసుల్లో చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఎస్ఐలకు, సీఐలకు శిక్షణ అందించినందుకు గాను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శాలువాతో సన్మానించి, బహుమతి ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, డిఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, సిఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో విద్యార్థుల విజ్ఞాన వికాసానికి 'స్నేహ' హస్తం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల విజ్ఞాన వికాసం కోసం జిల్లా యంత్రాంగం 'స్నేహ వేసవి సెలవుల శిబిరాన్ని' వినూత్నంగా నిర్వహిస్తోందనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన ఈ శిబిరాల సన్నాహకాలపై సమన్వయ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విజ్ఞానాన్ని పొందేలా ఈ శిబిరాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో, అంతర్జాతీయ సంస్థ యునిసెఫ్ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ శిబిరాలు జరగనున్నాయన్నారు . మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు సైతం ఈ శిబిరాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసి ఈ వేసవి శిబిరాలను విజయవంతం చేయాలని, విద్యార్థులు తమ సెలవులను వృధా చేసుకోకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ రవీందర్,

డిహెచ్మెచ్వో నరేందర్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





### ధాన్యం సంచులను భద్రంగా నిల్వ చెయ్యాలి అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

నిర్మల్ జిల్లా మే 6 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును పరిశీలించారు. గోదాములో ధాన్యపు డంపింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లారీలలో వచ్చిన దాన్యపు సంచులను ఎప్పటికప్పుడు భద్రంగా నిలువ చేయాలన్నారు. ఎక్కువమంది హమాలీలను నియమించుకొని వెంటవెంటనే ధాన్యపు సంచుల డంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యపు సంచుల వివరాలు, అన్లోడింగ్ కు వరుసలో సిద్ధంగా ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటుచేసిన వరి, మొక్కజొన్న దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్ లు, తహసిల్దార్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తర్నం గ్రామంలో పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ నేరడిగొండ మండలంలోని తర్నం గ్రామంలో నిర్వహించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయంలో గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రెండు నిండు ప్రాణాలు బలి

## మరణించిన వారి కుటుంబాలకు 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ : మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 06: నిన్న అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి లక్షెట్టిపేటమండలం గంపలపల్లి గ్రామానికి చెందిన తనుగుల నాగరాజు,తనుగుల అభిరామ్ పార్థివ దేహాలను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సందర్శించిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మరియు మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు మరియు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్.పార్థివ దేహాలను సందర్శించిన అనంతరం,మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ నిన్న కురిసిన భారీ వర్షానికి, గంపలపల్లి గ్రామానికి చెందిన తనుగుల నాగరాజు తనుగుల అభిరామ్ తండ్రి కొడుకులు మృతి చెందడం చాలా బాధాకరం అని అన్నారు. వారి మరణానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. భారీ వర్షానికి వారు పండించిన పంటను కాపాడుకునే ప్రయత్నంలో వారి ప్రాణాలని బలికొన్నారు. పది రోజుల క్రితం కాంట అయిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల జరిగిన ఈ ఘటన కు పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలి అని డిమాండ్ చేశారు.రైతులను గాలికి వదిలేసి వడ్లు సరైన సమయానికి కొనుగోలు చేయకపోవడం వలన ఈరోజు ఇలాంటి విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరియు మంచిర్యాల ఎమ్మెల్యే,మరియు మంచిర్యాల జిల్లా అధికారుల అనాలోచిత,నిర్లక్ష్య ప్రవర్తన వల్లే ఈ విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిర్యాల ఎమ్మెల్యేకు రైతుల మీద ఎందుకు అంత కోపమా అర్థం కావడం లేదు అని అన్నారు. మరణించిన వారి కుటుంబాలను వెంటనే ఆదుకొని 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు విట్టల్ రెడ్డి

### తానూరు మండలంలోని హంగిర్గా గ్రామం లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముధోల్ మాజీ శాసనసభ్యులు . జి. విట్టల్ రెడ్డి






అమృత్ తెలంగాణ బైంసా న్యూస్ హంగిర్గా గ్రామానికి చెందిన లలిత సాయినాథ్ గారి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం మహోత్సవం లో పాల్గొనడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు మరియు గృహ నిర్మాణ శాఖ మాత్యులు గౌరవనీయులు పొంగలేటి శ్రీనివాసరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ముధోల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జీ. విఠల్ రెడ్డి ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, స్థానిక సర్పంచ్ భూమాబాయి శివారియప్ప,వైస్ చైర్మన్ ఎండి ఫరూక్ అహ్మద్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, వార్డ్ మెంబర్లు సరస్వతి,మాజీ సర్పంచ్ పోశెట్టి,లక్ష్మణప్ప, ధర్మపురి భూమన్న వీడిసి అధ్యక్షులు, నర్సింహులు మరియు శ్రీనివాస్,ఆనందరావు, శ్రీకాంత్, అశోక్ మరియు గ్రామ పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు

# జూ. అతిలోక సుందరి సమ్మోహనం



మరోవైపు జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. బాలీవుడ్ నుంచి టాలీవుడ్కి జాన్వీకపూర్ ప్రయాణం గురించి తెలిసినదే. జాన్వీ సౌత్ లోను వేవ్స్ క్రియేట్ చేస్తోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం అందుకుంది. దేవర లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తో ఘనమైన ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు మగధీర రామ్ చరణ్ సరసన క్రేజీగా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీలో నటిస్తోంది. ఈ సినిమాలో తనకు నటిగా నిరూపించుకునే ఆస్కారం బుచ్చిబాబు కల్పించాడని టాక్ వినిపిస్తోంది. షూటింగుల కోసం జాన్వీ హైదరాబాద్ కి వచ్చి వెళుతోంది. ఇటీవల ముంబై టు హైదరాబాద్ ప్రయాణాలతో బిజీ బిజీగా ఉంది.

# నీ వల్లే నీ వల్లే ఈ మాయే నీ వల్లే.. సిద్ శ్రీరామ్ మార్క్..!



మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఏది ప్రయత్నించినా సరే తెలుగు ఆడియన్స్ అలాంటి సినిమాలను భుజాన వేసుకుని సక్సెస్ చేస్తారు. కాన్సెప్ట్ సినిమాలకు ఉన్న డిమాండ్ అది. అందుకే కొత్త కథ ఉంటే చాలు దానికి తగినట్టుగా సినిమా వైబ్ ని క్రియేట్ చేసి దానికి తగిన ప్రమోషన్స్ ని చేస్తున్నారు. యువ దర్శకులు తమకు వచ్చిన ఛాన్స్ ని అన్ని విధాలుగా యూజ్ చేసుకుంటున్నారు. ఇక అలాంటి యువతరం కథతో కొత్త పాయింట్ తో వస్తున్నారు త్రిబాణధారి బార్బరిక్. మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. వశిష్ట ఎన్ సింహ, సత్యరాజ్, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, ఉదయ భాను ఇంపార్టెంట్ రోల్స్ లో నటిస్తున్నారు. త్రిబాణధారి బార్బరిక్ సినిమా మోషన్ పోస్టర్ ఫస్ట్ గ్లింప్స్ తోనే ఆడియన్స్ లో ఒక ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా నీవల్లే నీవల్లే అనే సాంగ్ రిలీజ్ చేశారు. రఘురాం లిరిక్స్ అందించిన ఈ సాంగ్ ను స్టార్ సింగర్ సిద్ శ్రీరామ్ ఆలపించారు. సిద్ శ్రీరామ్ పాట పాడితే ఆ మ్యాజిక్ ఎలా ఉంటుందో తెలిసిందే. దానికి ఏమాత్రం తగ్గకుండా ఈ సాంగ్ ఉంది. 'తండేల్' సాంగ్ వీడియో కూడా యూత్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాకు కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా మెన్ గా పనిచేస్తుండగా ఇంఫ్యూజన్ బ్యాండ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. సినిమా టైటిల్ ఇంకా కాన్సెప్ట్ కొత్తగా ఉండేలా ఉంది కాబట్టి తెలుగు ఆడియన్స్ ఈ సినిమాను ఆకట్టుకునే ఛాన్స్ ఉంది. త్రిబాణధారి బార్బరిక్ టైటిల్ తోనే ఆడియన్స్ అటెన్షన్ రాబట్టిన మేకర్స్ సినిమా ప్రమోషన్స్ సాంగ్స్ తో మరింత బజ్ పెంచాలని చూస్తున్నారు. లేటెస్ట్ గా సినిమా నుంచి రిలీజైన సిద్ సాంగ్ మాత్రం మ్యూజిక్ లవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది.

# రేటు పెంచేసిన ఐశ్వర్యా రాజేష్



కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు సీనియర్ హీరో రాజేష్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగపెట్టిన ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు ఎక్కువ తమిళ సినిమాలే చేస్తుంటుంది. కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు. అందుకే ఐశ్వర్య కోలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేసుకుంటూ సెటిలైంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండే ఐశ్వర్యా రాజేష్ తన తండ్రి లెగసీని తెలుగులో కంటిన్యూ చేయాలనుకుంది కానీ అనుకున్న విధంగా ఆమెకు అవకాశాలు దక్కక కోలీవుడ్ కు వెళ్లి అక్కడ కెరీర్ ను స్టార్ట్ చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తన టాలెంట్ తో దాదాపు 50 సినిమాల్లో నటించిన ఐశ్వర్యా రాజేష్,




# సూపర్ హాల్ లో నేహాశర్మ కైపెక్కిస్తుందే!



నేహా శర్మ అందాల సరాగాల గురించి చెప్పాల్సిన పనిలేదు. బ్యూటీ సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా విరుచుకుపడుతుంది. ఇన్ స్టాగ్రామ్.. ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో రెగ్యులర్ గా టచ్ లో ఉంటోంది. నిరంతర ఫోటోషూట్లతో సెల్ఫీ షూట్లతో హీటెక్కిస్తుంటుంది. గడిపేస్తోంది. యూత్లో ఎప్పటికప్పుడుడు చర్చకొస్తుంటుంది. రేర్ గా సిస్టర్ ఐశాశర్మతోనూ ఫోటో సెషన్స్ లో పాల్గొంటోంది. అక్కా-చెల్లి ఇద్దరు కలిసి అందాల దాడికి దిగారంటే? ఆ కథ వేరుగా ఉంటుంది. అయితే ఈసారి అంతటి సాహసానికి పూనుకోలేదు. నేహా శర్మ సోలోగానే అందాల విందు చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com